# విజేత

— కాటూరు రవీంద్ర త్రివిక్రమ



రావిచెట్టు ఆకులు గలగల నవ్వేయి. వాటి పెదవులమీదనుండీ జారుతున్న వెలుగు కిరణాలు వీర్రాజు వెండి గడ్డం మీద మెరుగులు దిద్దుతున్నాయి.

మట్టి ముంతలోంచి యింత అంబలి గ్లాసులోకి వంచి, ఓ ఉప్పురాయి విదిలించి, చేతి కందించింది రాజవ్వ.

కుంటికాళ్ళని మంచం మీదకి లాక్కుని, రావిచెట్టుకి వీపానించి కూర్చున్నాడు. మధ్యమధ్య మునివేళ్లతో మీసాలు తుడుచుకుంటూ, అమరేంద్రుడి ఠీవితో ఆ అపరాహ్ణంవేళ అమృతం లాంటి అంబలి సేవిస్తున్న వీర్రాజు కళ్ళకి దూరంగా చారల బనీను, లుంగీతో వస్తున్న దుర్గడు కనుపించాడు. ఆ బట్టల్లో వాడు అచ్చం దమ్ములగొండిలా ఉన్నాడు. దుక్కలా బలిసిపోయిన శరీరంతో, దొర్లుకొస్తున్న రాతిరథంలా ఉన్నాడు.

అంబలి పూర్తిగా తాగకుండానే

"ఒసేవ్ దుర్గడొస్తున్నాడు — అంబలి కావాలంటాడేమొ ...." అన్నాడు పెళ్ళాంతో.

రాజవ్వ బోసిగా నవ్వేసి "వాడు అంబలి తాగకేం, నీ పిచ్చిగాని" అంటూ తన గ్లాసులో ఉన్న అంబలి నోటికి తాకించుకుంది.

"ఏరోవ్ ముసలాడా.... వంటరిగా అంబలి కొట్టేస్తున్నావల్లే ఉందే" అంటూ వచ్చి మంచంమీద బరువుగా కూల బడ్డాడు.

ఆ తాకిడికి కుక్కి మంచం గిలగిల్లాడి పోయింది.

వీర్రాజు బిగాలుగా చూస్తు "ఒరే దురగా! ఎవురో దరమపెబువులు దానం చేసిన కుక్కి మంచం. ఈ తుంటోడి కది కూడా కరువుసెయ్యబాక" అన్నాడు.

"అంతగా పోతే మరోటి కొనిస్తా లేరా... ఊఁ.... యిందబీడీ కాల్చుకో ...." అంటూ చేతికిచ్చాడు, దుర్గడు.

వీర్రాజు మొహం నిండా సంతోషం అలముకుంది. ఆత్రంగా వెలిగించు కున్నాడు.

బీడీ పొగమధ్య వాడు మేఘాల రాజులా ఉన్నాడు.

"మా గొప్పగా ఉందిరా" అన్నాడు సంబరం నిండిన గొంతుతో.

"ఉంటది.... ఉంటది.... బేవార్సది గదు!"

వాడి ఛలోక్తికి ముసలి రాజవ్వ విరగబడి నవ్వింది.

"ఓరి పోరా .... నువ్వేదో చెవఁ టోడ్చి సంపాయించినట్టు.... అళ్లు యీళ్లు యిచ్చే కిరాయి డబ్బులేగా...." తుస్కా రించేశాడు.

"ఒరేయ్ ముసలోడా! ఆ మాటకొస్తే కిరాయిడబ్బులు తీసుకోం దెవరు! గుమాస్తా నాయాళ్లు బుర్రలమ్ముకుంటే నేను కంఠలమ్ముకుంటున్నా. తప్పేంటి?"

"అరేయ్! చదువుకున్న బాబులు అళ్ళతో పోల్చబోకు. ఎదవన్నర ఎదవ- ఏలిముద్దర తప్ప సంతకం చెయ్యటం రాదు నీకు... అళ్ళతో పోలికేందిరా? నీకు నీతుందా? మంచుందా?"

"ఛీ....ఛీ" ఘొల్లున నవ్వేడు దుర్గడు. చెట్టుమీద సేద తీరుతున్న కాకి బెదిరి పారిపోయింది.

"చదూకున్నోళ్ళందరూహరిచ్చెంద్రు లంటావా?" కళ్లలోకి సూటిగా చూస్తూ ప్రశ్నించాడు.

"అరేయ్ నువ్వేన్నన్నా జెప్పు.... చదూకున్నోళ్లు చదూకున్నోళ్లే.... అళ్ళతో మనం పోల్చుకోలేం...." ముస లాడు బీడీ నుసిని రాల్చాడు.

"చూడు ఈర్రాజూ! చదూకున్న బాబులు కూడ దుర్గడుకన్న పెద్దనేరాలు చేస్తారు. లంచాలు తింటరు.... కరీ దయిన సారా తాగుతారు. దొంగతనాలు చేస్తారు ... అమ్మాయిల్ని చెడగొడ తారు...."




"ఊరకుండెహె... ఎదవసాయాల" ముసలోడు బీడీ అవతలికి పారేసి సర్దుక్కూర్చున్నాడు. దుర్గడు నిర్లక్ష్యంగా నవ్వి, ముసల్దానికేసి తిరిగేడు.

"ఒసేయ్.... రాజవ్వా! ఓ గళాసు నీళ్ళు."

సత్తుగ్లాసుతో నిండుగా నీళ్ళిచ్చింది.

గట, గట తాగి గ్లాసు కిందపడేసి లేచాడు.

"నే పోతున్నరో ముసలోడా .. కాసేపు తొంగో...." మఫ్లరు దులిపి భుజంమీదేసుకుంటూ అన్నాడు దుర్గడు.

వీర్రాజు మంచంమీదకి సర్దుకుంటూ "మళ్ళీ యాడకి బోతవ్‌రా? కాలు కుదురులేదేరా నీకు?" విసుక్కున్నాడు గట్టిగా.

"అఁ.. అఁ.... నీ మాదిరి కుంటోడైనాక కుదురొస్తదిలే.... నే వస్తా!" అని ఓ అడుగు ముందుకేసి "హా త్తెరీ...." అంటూ ఆగిపోయేడు.

అంత దూరంలో ఆణిముత్యంలాంటి ఆడపిల్ల కన్పించింది.

ఆ పిల్ల షోకులు తెలియనిదాన్లా నేత చీర కట్టుకుంది.

చేతిలో పుస్తకాలు బ్రతుకుతెరువు కోసం పడే పాట్లని సూచిస్తున్నాయి.

కోడిపిల్లని చూసిన గద్దలా, పావు రాన్ని చూసిన డేగలా ఉషారుగా ఈల వేసుకుంటూ ముందుకు కదిలాడు దుర్గడు.

ముసలాడు, ముసల్దీ బాధగా చూస్తుండిపోయేరు.

* * *

చెట్టుమీద ఆకు కదలటంలేదు.

వీర్రాజు విసుగ్గా దోమల్ని అరచేత్తో బాత్తున్నాడు.

రాజవ్వ పల్చటి పాతచీర కప్పుకుని అలసటగా కునుకుతీస్తోంది.

దుర్గడు దూరంనుండే "తాగితే తప్పే ముందీ? తాగనోడి గొప్పేముంది?" అని సొంతపాట పాడుకుంటూ వస్తున్నాడు.

వీర్రాజు లేచి కూర్చున్నాడు.

దుర్గడు అంతకంతకు సమీపిస్తున్నాడు.

రాత్రి పది దాటితేగానీ వాడు తన మకాం జేరుకోడు.

వీర్రాజు దుర్గడివైపే చూస్తున్నాడు.

వాడే బాగా చదువుకుని ఉంటే-ఇలా ఉండేవాడా?

ఏ ఆఫీసరయిపోయేవాడో.... కనీసం గుమాస్తా అయినా అయ్యేవాడు. పెళ్ళి-పెళ్లాం- పిల్లలు- సంసారం- సరదాలు- జీవితం అదో హాయి....

వాడు ఎవడి కొడుకో వాడికే తెలియదు। తెలియకుండానే గాలిగా, సృష్టికి బిడ్డలా పెరిగాడు.

పెరిగినవాడు పూలమొక్కో, పళ్ల చెట్టో కాలేదు- ముళ్లపొద అయ్యాడు.

పొదని సమీపిస్తే ముళ్లు బాధించక మానవు కద?

వాడూ అంతే।

దుర్గడు సమీపించాడు.

వీర్రాజు మంచంమీద మణుగు బరువు మూటలా పడ్డాడు. వీర్రాజు గుండె గుట గుటలాడింది. "ఈ మంచం యిరగ్గొట్టే దాకా యీడు ఒదిలేలాలేడు" గొణు క్కున్నాడు.

ఆ రాత్రికి నిద్రపోయే గీతలేదు వీర్రాజుకి। దుర్గడు పడుకోగా మిగిలే జాగా మునగదీసు క్కూర్చోటానికే చాలదు. దుర్గడు వాగివాగి, పాటలు పాడి పాడి, చివరకి గురకలు కొడుతూ నిద్ర పోతాడు. ఈ గొడవంతా అతనికి పాతదే. అయితే ప్రతిరోజూ ఇలా ఉండదు. ఒక్కోమాటు ఎక్కడికి వెళతాడో తెల్లారేదాకా కనుపించడు।


"రేయ్ దురగా...."

"ఏంట్రా ముసలినాయాలా."

"ఆ యాడకూతుర్నేం జేసావురా?" మధ్యాహ్నం వాడు వెంటాడిన పిల్ల రూపాన్ని గుర్తుచేసుకుంటూ అడిగాడు.

"ఎగిరిపోయిందిరా... చాన్సు పోయింది..." పెదవి విరుస్తూ అన్నాడు.

ముసలాడు కొండంత బరువు దింపు




కున్నాళ్లు సంతోషపడ్డాడు. 'దేవుడా! ఈ రాచ్చసుడి పాలబడకుండా ఆడకూతుళ్లని కాపాడు. .' అని ప్రార్థించాడు మూగగా.

దుర్గడి గొంతు విన్పించటం మానేసి, గురక మొదలయింది!

* * *

ఎండ చుర్రుమన్నాక లేచికూర్చున్నాడు దుర్గడు.

రూపాయికాయితం తీసి ముసల్దానికిచ్చి "ఎల్లి చాయ్‌నీల్లు తేవే" అన్నాడు బద్ధకంగా ఆవులిస్తూ.

ఆ రూపాయిలో మిగిలిన చిల్లర అడగడు. ఇచ్చినా పుచ్చుకోడు. అందుకే వీర్రాజు దంపతులకి దుర్గడంటే మక్కువ. వాడికి వీలైన విధంగా సాయపడుతుంటారు. వాడివల్ల ఇబ్బంది కలిగినా భరిస్తారు.

ఎండ మీదపడకుండా గోనెగుడ్డ సరిచేసి మంచంమీద వెనక్కి జరిగి, గోడకి వెన్ను ఆనించాడు, దుర్గడు. అంతలో ముసల్ది టీ తెచ్చి ఇచ్చింది. సగం ముసిలాడికిచ్చి మిగతా సగం తాగాడు.

"రేయ్, ఇంత మంచోడివి ... ఎందుకురా ఇట్టా నాశనం అయిపోతావ్ .. నా మాటిను. నే చెప్పింది ఇనుకో. నీలాగే ఎదవపన్లు సెయ్యబట్టే, ఇట్టా కుంటెదవలా పడి కొట్టుకుంటున్నా. నీకు తెలవదా సంగతి... "

ఆశ్చర్యంగా చూశాడు దుర్గడు.

"అయితే నువ్వా ఒకప్పుడు రౌడీయే సంట్రా ముసిలోడా?"

"అలాంటి ఇలాంటి రౌడీని కాదు రోయ్.... నా పేరు చెబితే ఆడపిల్లలు రోడ్డుమీద కొచ్చీవోళ్లు కాదు...."

"అహ్హా!!" ఉషారుగా మంచంమీద సర్దుకూర్చున్నాడు.

"ఎంతమందిని చూశావేంటి చూపు?" కన్ను గిల్లుకుతూ అడిగేడు.

"ఎంతమందిరని చెప్పమంటావ్? నే నెప్పుడూ నీలా శాతకాని పిల్లల జోలికి పోలా.... బాగా దనమదం నిండిన గుంటల్ని ఎంటాడేవోడ్ని. ఆ పిల్లలు చిక్కితే డబ్బుకి డబ్బా మజాకి మజా దొరికేది..."

"అరి దొంగనాయాల ... మరి చెప్పావు కాదేం?" గాలిలోకి తేలిపోతూ, "ఓ మంచిపిల్ల కత చెప్పరా ముసిలోడా" సిగిరెట్టు ఒకటి అందిస్తు అన్నాడు.

ముసలాడు సిగిరెట్ అందుకుని, రెండు దమ్ములు పీకి, "ఆ యమ్మాయి మల్లెపువ్వునా గుండేది. అట్టాంటి కారు లోనే ఎళ్లేది... ఎన్నాల్లకోగానీ శాన్సు చిక్కలేందిగాదు...."

"చాన్సు కొట్టేశానంటావ్?!" ఉద్వేగంగా ప్రశ్నించాడు దుర్గడు.

"చాన్సుకొట్టిన మర్నాడే కాళ్లు రెండూ ఇరిచేశారు...."

దుర్గడు అదిరిపడ్డాడు.

"ఎవరూ?"

"ఎవరేందిరా? మనం ఎదవపనిజేస్తే ఎవర్రా నోరు మూసుకునేది. ఆ అమ్మాయి తాలూకువోళ్లు ఊరుకుంటారట్రా? రేపు నీ పనీ అంతే!"

"ఛ.... ఎవన్నెవర్రా అంత పని జేసేది?" బింకంగా అన్నాడు.

నవ్వేడు ముసలాడు.

"రేయ్– దురగా.... నేనూ నీలాగే మొరాయించుకు తిరిగా.... కాళ్ళిరిశాక గానీ తెలియలా మనకంటే మొనగాళ్లుంటారని."

దుర్గడు చికాగ్గా లేచివెళ్ళిపోయాడు.

ముసల్ది అటే చూసూ "నీ కాళ్లు కారు కింద పడితే కద పోయాయి? అట్టా జెప్పావేం?" అంది.

"మరి యీ రాచ్చసుడికి అట్టా సెబుతే గానీ మడిసిగా మారడు!" సిగిరెట్ అవతల గిరాటేస్తూ అన్నాడు, ముసిలాడు.

"మారతాడంటావా?"

"మారనివాడయితే అట్టా కోపంగా ఎల్లిపోడు. ఆడికి గుండెల్లో దక్కుపట్టింది. ఎవడి కాళ్లు ఎవడికి కిష్టంకాదు?"

"అంతేలే– ఆ మాటా నిజమే!" ముసల్ది వప్పుకుంది.

ముసలాడు నవ్వేడు.

ఆ నవ్వులో విజయగర్వం వుంది.

———